
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
నాగర్‌కర్నూల్
జిల్లా వార్తలు
సోమవారం 21 జూలై 2025
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 32.0 కనిష్ఠం : 24.0



గురుకుల విద్యార్థులకు అస్వస్థత
- పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ గురుకుల పాఠశాల, కళాశాలలో ఘటన 7

అనుమానాస్పద స్థితిలో రైతు మృతి 7



సుస్తయింది!

● గద్వాల జిల్లాలో విజృంభిస్తున్న డెంగీ, టైఫాయిడ్ జ్వరాలు

- జిల్లాలో ఇప్పటివరకు 6 డెంగీ, 7 టైఫాయిడ్ కేసులు నమోదు
- ఎలీసా పరీక్ష ద్వారానే రోగాలను నిర్ధారణ చేయాలి

గద్వాల క్రైం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత కాలంలో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న రోగాలలో డెంగీ ఒకటి. రోగాల బారిన పడుతున్న వారి సంఖ్య గత కొద్దికాలంగా విపరీతంగా పెరిగిపోతుంది. జిల్లా ప్రజలు ముఖ్యంగా డెంగీ, టైఫాయిడ్, మలేరియా, డయోరియా కేసులతో పాటు వైరల్ జ్వరాల బారిన పడుతున్నారు. ఇందులో కూడా జిల్లాలోని వివిధ ప్రాంతాలకంటే పట్టణంలోని ప్రజలు రోగాల బారిన పడి రోజుల తరబడి ఆస్పత్రిలో చికిత్సలు పొందుతున్నారు. వీటిని నివారించాల్సిన అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో వీటిసంఖ్య ఇంకా ఎక్కువగా పెరిగిపోతున్నది. గ్రామాలతో పోలిస్తే పట్టణంలోని వార్డులలో పెరిగిన పిచ్చిమొక్కలు, ఎక్కడ పడితే అక్కడ నిలిచిన డ్రైనేజీ నీరు, అధికారుల నిర్లక్ష్యంతో కాలువలను శుభ్రపర్చకపోవడం, చెత్తను అలాగే ఉంచడంతో దోమల సంఖ్య విపరీతంగా పెరిగి జ్వరాలకు కారణంగా మారుతున్నది. జోగుళాంబ గద్వాల జిల్లాలో గత కొంతకాలంగా సీజనల్ వ్యాధులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అయితే ప్రభుత్వ ఆసుపత్రులతో పోలిస్తే ప్రైవేట్ ఆసుపత్రిలలోనే సీజనల్ వ్యాధులతో బాధపడుతు చికిత్స పొందుతున్న వారి సంఖ్య ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తుంది.

● 6 డెంగీ, 7 టైఫాయిడ్ కేసులే..

జోగుళాంబ గద్వాల జిల్లాలో అధికారికంగా 2025, జనవరి నుంచి ఇప్పటివరకు కేవలం 6 డెంగీ కేసులు, 7 టైఫాయిడ్ కేసులు మాత్రమే నమోదైనట్లు వైద్యాధికారులు చెబుతున్నారు. అయితే వీటి సంఖ్య రోజురోజుకు డెంగీతో పాటు టైఫాయిడ్, మలేరియా, ఇతర వైరల్ జ్వరాలతో ప్రభుత్వ ఆసుపత్రులతో కంటే ప్రైవేట్ ఆసుపత్రులతో తారాస్థాయికి చేరిందనే విషయం వైద్యాధికారులు గమనించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. ప్రైవేట్ ఆసుపత్రులు ప్రతిరోజు రోగులతో కిక్కిరిసి పోతున్నాయి. జిల్లాలో అధికారికంగా 2079 మందికి ఫీవర్ సర్వే నిర్వహించగా ఇందులో 144 ఫీవర్ కేసులు నమోదు అయినట్లు వైద్యసిబ్బంది తెలిపారు. అలాగే జిల్లాలో ఆరుగురు డెంగీ, ఏడుగురు టైఫాయిడ్ కేసులు నమోదు కాగా, ఎవరు కూడా వీటి బారిన పడగా ఇందులో ఎవరికి కూడా ప్రాణాపాయం సంభవించలేదని వైద్యాధికారులు తెలిపారు.



గద్వాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వైరల్ ఫీవర్ బాధితులు

● ఆ పద్ధతిలో నిర్ధారణ చేయాలి

జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రితో పాటు అన్ని పీహెచ్‌సీలలో డెంగీ, టైఫాయిడ్, చికున్‌గున్యాలకు ఎలీసా పద్ధతిలో, మలేరియాకు స్లైడ్ మెథడ్ పద్ధతిలో పరీక్షలను నిర్వహించి వ్యాధి నిర్ధారణ చేస్తారు. అయితే వీటి ద్వారా నిర్ధారణ చేస్తేనే వ్యాధిని కచ్చితంగా చెప్పవచ్చని వైద్యాధికారులు సూచిస్తున్నారు. కిట్ మెథడ్ ద్వారా రోగనిర్ధారణ సరైన పద్ధతి కాదని, కానీ జిల్లాలోని అన్ని ప్రైవేట్ ఆసుపత్రులు, ల్యాబ్‌లు కిట్ మెథడ్ ఉపయోగించి రోగాలు నిర్ధారణ చేసి ప్రజలను భయపెడుతున్నట్లు తెలుస్తున్నది. ఈ వ్యాధులు కూడా ఎలీసా పరీక్షలతో నిర్ధారణ చేయాల్సింది ఉంటుంది. కానీ అలా ఎవరు కూడా చేయకుండా రోగాల పేరుతో వారిని భయభ్రాంతులకు గురిచేస్తే రూ. 20 నుంచి 30 వేలు దండుకుంటున్నట్లు తెలుస్తున్నది. ఇక డెంగీలో ప్లేట్‌లెట్స్ పడిపోయాయని, మరీ ఎక్కువగా దోచుకోవడం ప్రైవేట్ ఆసుపత్రులకే వర్తిస్తున్నట్లు తెలుస్తున్నది. ఇంత జరిగినా వైద్యాధికారులు ప్రైవేట్ ఆసుపత్రుల దోపిడీని అరికట్టడంలో విఫలం అవుతున్నారు.



డ్రై డే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది(ఫైల్)

● జ్వరాలు వస్తే వైద్య సిబ్బందికి సమాచారం ఇవ్వాలి



వైరల్ జ్వరాల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. జిల్లాలో ఇంటింటికి వెళ్లి ఫీవర్ సర్వేను వైద్యసిబ్బంది నిర్వహిస్తున్నారు. ఒకవేళ ఎవరైనా జ్వరంతో బాధపడుతున్నట్లైతే వెంటనే వైద్యసిబ్బందికి సమాచారం ఇవ్వాలి. వైద్యసిబ్బంది తగు సూచనలు, మందులు ఇచ్చి జ్వరాలను పూర్తిస్థాయిలో నయం అయ్యేలా చూస్తారు. ఒకవేళ జ్వరాలు తీవ్ర స్థాయిలో ఉన్న వెంటనే జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి గాని, పీహెచ్‌సీలలో వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించుకోవడం తప్పనిసరి. ఇంటి పరసరాలను, ఇంటిని పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ఎక్కువ కాలం నీటిని నిలువ ఉండకుండా చూడాలని గ్రామాల్లో ప్రత్యేకంగా వైద్యసిబ్బంది అవగాహన కార్యక్రమాలను కూడా ఏర్పాటు చేస్తున్నారు. అలాగే గ్రామాల్లో, పట్టణాల్లో ఒక డెంగీ కేసు నమోదు అయిన వెంటనే ప్రత్యేకంగా ర్యాపిడ్ రెస్పాన్స్ టీంలు రంగప్రవేశం చేస్తున్నారు. జిల్లాలో 11 ర్యాపిడ్స్ టీంలు ఉన్నాయి.

- డాక్టర్ సిద్ధప్ప, డీఎంహెచ్‌వో, గద్వాల

వర్షాకాలం ప్రారంభమైన నాటినుంచి ఈ సీజనల్ వ్యాధులు ప్రజలపై ఎక్కువగా ప్రభావాన్ని చూపుతాయి. ముఖ్యంగా టైఫాయిడ్, డెంగీ, మలేరియా, చికున్‌గున్యా తదితర సీజనల్ వ్యాధులపై కూడా సర్వే నిర్వహించడం జరుగుతుంది. జోగుళాంబ గద్వాల జిల్లాలో ఎలాంటి చికున్‌గున్యా, మలేరియా కేసులు నమోదు కాలేదు.

మహిళల ఆర్థిక అభివృద్ధికి పెద్దపీట

- డీసీసీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ
- జిల్లా కేంద్రంలో ఘనంగా ఇందిరా మహిళాశక్తి సంబురాలు



ఇందిరా మహిళాశక్తి కార్యక్రమంలో మహిళా సంఘాల సభ్యులకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, రాజేశ్‌రెడ్డి

నాగర్‌కర్నూల్ టౌన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు అందరికి ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా వారి అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని డీసీసీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని తీగల వెంకటస్వామి కన్వెన్షన్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఇందిరా మహిళాశక్తి సంబురాలు 2025 ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన వేడుకలకు డీసీసీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ హాజరయ్యారు. నాగర్‌కర్నూల్ నియోజవర్గంలోని 254 స్వయం సహాయక సంఘాలకు రూ.14.22 కోట్ల వడ్డీ లేని రుణాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాల్లో ఉన్న వహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో స్వయం సహాయక సంఘాలతో మహిళల జీవితాల్లో భారీ మార్పులు తీసుకువస్తున్నామన్నారు. స్థానిక ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి మాట్లాడుతూ మహిళా సంఘాలకు రుణాలతో వారి కుటుంబాల జీవనోపాధికి మార్గం వేస్తున్నామన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు, అదనపు కలెక్టర్ అమరేందర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి చిన్న ఓబులేష్, స్వయం సహాయక సంఘాల డీపీఎం అరుణాదేవి, కాంగ్రెస్ పార్టీ మాజీ కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భూభారతి దరఖాస్తులు
త్వరగా పరిష్కరించాలి

- నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

కల్వకుర్తి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న భూభారతి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఆదివారం కల్వకుర్తి తహసీల్దార్ కార్యాలయంలో కల్వకుర్తి రెవెన్యూ డివిజన్ పరిధిలోని మండలాల తహసీల్దార్లతో భూభారతి దరఖాస్తులపై కల్వకుర్తి ఆర్డీవో ఎస్.శ్రీనుతో కలిసి కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ బదావత్ సంతోష్ మాట్లాడుతూ భూభారతి ద్వారా భూ వివాదాలు తగ్గి రైతులకు భూ యజమానులకు శాశ్వత న్యాయం జరిగేలా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తున్న నేపథ్యంలో రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. భూ దరఖాస్తులను తిరస్కరిస్తే కారణాలను రాతపూర్వకంగా ఇవ్వాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కల్వకుర్తి రెవెన్యూ డివిజన్ పరిధిలోని కల్వకుర్తి, వెల్దండ, వంగూరు, ఊర్కొండ, చారకొండ మండలాల్లో 73రెవెన్యూ గ్రామాల నుంచి 3126 దరఖాస్తులు వచ్చాయని ఆర్డీవో తెలిపారు. 2040 దరఖాస్తులకు నోటీసులు అందజేయగా, 1846దరఖాస్తులను ఆమోదించచినట్లు తెలిపారు. 1280దరఖాస్తులను తిరస్కరించినట్లు ఆర్డీవో శ్రీను కలెక్టర్‌కు వివరించారు. కల్వకుర్తి తహసీల్దార్ ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

నాటుడు.. కొట్టుడు

● రోడ్డు పక్కన చెట్ల పెంపకం సాధ్యమా?

- లక్ష్యం నిర్వీర్యం
- విద్యుత్ సరఫరాకు అడ్డంకిగా చెట్ల కొమ్మలు
- అధికారుల మధ్య సమన్వయ లోపం
- ప్రభుత్వ ఖజానాకు భారం

ఖిల్లాఘణపురం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): హరితహారం, వన మహోత్సవం పేరిట గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ప్రతీ ఏటా రోడ్డుకు ఇరువైపులా వర్షాకాలం మొక్కలు నాటిస్తారు... తీరా ఏపుగా పెరుగుతున్న చెట్లను విద్యుత్ తీగలకు ఆటంకంగా మారుతున్నాయని నరికించేస్తుండటం గమనార్హం. విద్యుత్ అధికారులు, పంట సాగు సమయంలో భూ విస్తీర్ణం నష్టపోతున్నామని ప్రధాన రహదారి పక్కనే ఉండే భూయజమానులు చెట్లను నరికేస్తున్నారు. అధికారులు వన మహోత్సవంలో మొక్కలు నాటడంలో ఉన్న శ్రద్ధ చెట్లను సంరక్షించడంలో, పచ్చదనాన్ని పెంపొందించడంలో ఆసక్తి చూపడం లేదని విమర్శలు ఉన్నాయి.



ఖిల్లాఘణపురం పెట్రోల్ బంక్ దగ్గర విద్యుత్ లైన్ కింద మొక్కలు నాటుతున్న ఈజీఎస్ కూలీలు

ప్రతీ సంవత్సరం గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఎన్ఆర్ ఈజీఎస్ ఉపాధి కూలీలు అధికారులు విధించే టార్గెట్లను పూర్తి చేయడానికి విద్యుత్ లైన్లను పట్టించుకోకుండా రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటడానికి శ్రమిస్తున్నారు. ఎండిన మొక్కల స్థానంలో తిరిగి నాటడం, చెట్లను నరికి వేసిన స్థానంలోనే కొత్తగా మొక్కలు నాటించడంతో ప్రభుత్వ ఖజానాపై ఆర్థిక భారం పెరుగుతున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. అధికారుల మధ్య సమన్వయ లోపంతో ప్రభుత్వ లక్ష్యాలు నిర్వీర్యం అవుతున్నాయి.



షాపూర్ రహదారిపై విద్యుత్ లైన్‌కు అడ్డంగా ఉన్న చెట్టును కొట్టివేసిన స్థలంలోనే నాటిన మొక్కలు

విద్యుత్ సరఫరాకు అంతరాయం



రోడ్డు పక్కన విద్యుత్ సరఫరా అయ్యే లైన్ల కింద హరితహారం, వన మహోత్సవంలో భాగంగా ఈజీఎస్ సిబ్బంది మొక్కలు నాటడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిస్తున్నాయి. తప్పని పరిస్థితుల్లో చెట్ల కొమ్మలను మాత్రం నరికి వేయాల్సి వస్తుంది. రోడ్డుకిరువైపులా మొక్కలు నాటే క్రమంలో విద్యుత్ లైన్ తీగలకు 10 ఫీట్ల దూరంలో నాటాలని సూచిస్తున్నాం. మొక్కలు నాటే క్రమంలో ముందుచూపుతో ఉండాలని కోరుతున్నా... ప్రతీ రోడ్డుకు హద్దులు నిర్ణయిస్తే సమస్య ఉండదు.

● సుధాకర్, ఇన్‌చార్జి ఏఈ, విద్యుత్ శాఖ

● వనపర్తి జిల్లాలో నాటిన మొక్కలు

సం.	లక్ష్యం	నాటినవి
2023-24	10,00,000	12,34,696
2024-25	10,00,000	9,12,539
2025-26	11,54,800	నేటి వరకు 5,37,751

ప్రతి సంవత్సరం లక్షల సంఖ్యలో మొక్కలు నాటుతున్న పచ్చదనం, అడవి విస్తీర్ణం మాత్రం పెరగడం లేదు.

ముఖ్యంగా రోడ్డు పక్కన పెరిగిన చెట్లను విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని చెట్లను నరికి వేసిన స్థలంలోనే ఈజీఎస్ సిబ్బంది తిరిగి మొక్కలు నాటుతున్నారు. ఏపుగా పెరిగిన చెట్ల నీడలోనే మరో వరుస మొక్కలను నాటడంతో చెట్లుగా ఎదగడానికి సూర్యకాంతి అందడం లేదు. రోడ్లకు హద్దులు నిర్ణయించకపోవడంతో రోడ్డు పక్కనే మొక్కలు, విద్యుత్ స్తంభాలు ఉండటంతో సమస్య జఠిలంగా మారింది.

జూరాలకు పోటెత్తిన పర్యాటకులు

- ప్రాజెక్టుపై భారీగా ట్రాఫిక్ జామ్
- చేపలరుచి కోసం ఎగబడిన సందర్శకులు



7 జూరాల ప్రాజెక్టు ఎడమ కాలువ వద్ద చేపల రుచి కోసం సందర్శకుల రద్దీ

సబ్ జూనియర్ సైక్లింగ్ పోటీల్లో
ఆత్మకూరు విద్యార్థిని ప్రతిభ

ఆత్మకూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): సబ్ జూనియర్ సైక్లింగ్ పోటీల్లో ఆత్మకూర్ ఎంవీ రామన్ పాఠశాల విద్యార్థిని ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల కరస్పాండెంట్ మొగిలి శ్రీధర్ గౌడ్ తెలిపారు. ఈ నెల 13న నారాయణపేట జిల్లాలో జరిగిన సబ్ జూనియర్ సైక్లింగ్ పోటీలలో ఐదు కిలోమీటర్ల విభాగంలో ఎం.వి. రామన్ పాఠశాలలో ఆరవ తరగతి చదువుతున్న సిరి ప్రార్థన ప్రతిభ కనబరిచి ఖేలో ఇండియా సబ్ జూనియర్ పోటీలకు ఎంపికైందన్నారు. ఆదివారం హైదరాబాద్ నగరంలోని నాగోల్ ప్రాంతంలో జరిగిన పోటీల్లో పాల్గొన్నట్లు ఆయన తెలిపారు. ఆత్మకూరులోని సీనియర్ క్రీడాకారులు, పాఠశాల ఉపాధ్యాయులు పలువురు అభినందించారు.



సిరి ప్రార్థన

అదుపు తప్పుతోంది..!

● భద్రతలేని బడి బస్సు

- యాజమాన్యం, డ్రైవర్ల నిర్లక్ష్యం.. విద్యార్థుల పాలిట శాపం
- వారంలోపు అయిజలో 9, అలంపూర్‌లో 4 బస్సులు సీజ్

6



అయిజలో బస్సును తోస్తున్న ప్రజలు(ఫైల్)

చేప పిల్లల పంపిణీ ఎప్పుడు?

- నేటి వరకు పిలవని టెండర్లు
- చేపల మంత్రిపై ముదిరాజ్‌ల ఆశలు
- గత ఏడాది 50శాతమే పంపిణీ

గద్వాల, జూలై 20 (ఆంధ్రజ్యోతి): చేపపిల్లల పంపిణీ కోసం ముదిరాజ్‌లు ఎదురు చూస్తున్నారు. మత్స్యకారులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు గత కొన్నేళ్లుగా ఉచితంగా చేపపిల్లల పంపిణీని ప్రభుత్వం చేస్తున్నది. ఈ ఏడాది ఇప్పటి వరకు కూడా ప్రభుత్వం టెండర్ల ప్రక్రియను చేపట్టలేదు. దీంతో చేప పిల్లల పంపిణీ ఉంటుందా..? లేదా..? అనే అనుమానాలను మత్స్యకారులు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే జూరాల, నెట్టెంపాడు ప్రాజెక్టుల ద్వారా రిజర్వాయర్లు, చాలా వరకు చెరువులు నీటితో నిండి ఉన్నాయి. గత ఏడాది మాదిరిగా ఈ ఏడాది చేపపిల్లల పంపిణీ ఆలస్యం చేస్తే చేపల ఎదుగుదల తగ్గిపోయి ఉత్పత్తి పడిపోతుందని దాని ద్వారా మత్స్యకారులు ఆదాయం కోల్పోతారనే భయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

మొదలు కాని టెండర్ల ప్రక్రియ

జిల్లాలో ఉచిత చేప పిల్లల పంపిణీకి టెండర్ల ప్రక్రియ మొదలు కాలేదు. గత ఏడాది 50శాతం మాత్రమే పంపిణీ చేయడంతో ఈ ఏడాది ఉంటుందా..? లేదా అనే అనుమానాలు మత్స్యకారులలో కనిపిస్తున్నది. కానీ పశుసంవర్ధక మత్స్యకార్మిక శాఖ మంత్రిగా ముదిరాజ్ బిడ్డ వాకిటి శ్రీహరి జిల్లా మంత్రే ఉండటంతో మత్స్యకారులు భారీగానే ఆశలు పెట్టుకున్నారు. అధికారులు మాత్రం టెండర్లు ఉంటాయని ఇందుకోసం అన్ని సిద్ధం చేసుకోవాలనే సంకేతాలు ఉన్నతాధికారులు ఇచ్చారని చెబుతున్నారు. ఒకవేల టెండర్లు ఉంటే ఈ పాటికే పిలిస్తేనే అనుకున్న సమయానికి చేపపిల్లలు మత్స్యకారులకు అందుతాయి. కానీ ఇప్పటి వరకు పిలవక పోవడంతో ఆశలు సన్నగిల్లుతున్నాయి.

నగదు బదిలీ పంపిణీపై ఆలోచనలు

కాగా ఉచిత చేప పిల్లల పంపిణీలో అనేక అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని కాంట్రాక్టర్లు అనుకున్న మేరకు పంపిణీ చేయడం లేదని మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. గత కొన్నేళ్ల నుంచి జరిగిన దోపిడీపై ఇప్పటికే ప్రభుత్వానికి వారు అనేక ఫిర్యాదులు చేశారు. ప్రభుత్వం మత్స్యకారులను ఆదుకునేందుకు నగదు బదిలీ పథకాన్ని ప్రవేశ పెట్టాలని మత్స్యకారులు విన్నవించారు. దీనిపై ప్రభుత్వం ఆలోచనలు చేస్తున్నట్లు సమాచారం.

గత ఏడాది 50శాతమే పంపిణీ

ప్రతీ ఏడాది ప్రభుత్వం జిల్లాలో 1.69కోట్ల నుంచి 1.78కోట్ల వరకు చేపపిల్లలను పంపిణీ చేస్తుంది. ఇందుకోసం రూ.2కోట్ల నుంచి 2.50కోట్ల వరకు చెల్లింపులు చేస్తుంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గత ఏడాది చేపపిల్లల పంపిణీ 50శాతంకు పడిపోయింది. 1.78కోట్ల చేప పిల్లల పంపిణీకి గాను 89లక్షల చేపపిల్లలనే గత ఏడాది అందజేశారు. ఇందులో 35-40ఎంఎం చేపపిల్లలు 67.16 లక్షలు, 80-100ఎంఎం చేపలు 21.85లక్షలను పంపిణీ చేశారు. చిన్న చేపపిల్లలకు ఒక్కోదానికి రూ.0.64పైసలు, పెద్దవాటికి రూ.1.74ను కాంట్రాక్టర్‌కు చెల్లింపులు చేశారు.



చేపపిల్లలు

డిజిటల్ కీలను సిద్ధం చేశాం



టెంటర్ల ప్రక్రియను మొదలు పెట్టడానికి డిజిటల్ కీని సిద్ధం చేసుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. దీంతో అన్నింటిని సిద్ధం చేశారు. ఆదేశాలు వచ్చిన వెంటనే టెండర్లు పిలుస్తాం.

- షకీలా బాను, జిల్లా మత్స్యశాఖ అధికారి, గద్వాల

సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్‌కు..
అడుగులు పడేనా?

● ఏర్పాటైతే అథ్లెట్లకు మెరుగైన శిక్షణకు అవకాశం
● పీయూలో అందుబాటులోకి వచ్చిన అధునాతన ట్రాక్


పీయూలో ఏర్పాటు చేసిన సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం క్రీడా హబ్‌గా రూపాంతరం చెందుతోంది. ఇప్పటికే స్టేడియంలో అధునాతనమైన మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం క్రీడాకారులకు ఇటీవల అందుబాటులోకి వచ్చింది. మైదానంలో ఆధునీకరణ పనులు చేపట్టి వాలీబాల్, ఖోఖో, లాంగ్‌జంప్, హైజంప్, బాస్కెట్‌బాల్ కోర్టులతో పాటు ఆర్చరీ జోన్ ఏర్పాటు చేశారు. అయితే మెయిన్ స్టేడియంలో అనేక క్రీడా సౌకర్యాలు ఉన్నప్పటికీ అథ్లెట్లు సాధన చేసుకునేందుకు సింథటిక్ ట్రాక్ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. మట్టితో ఏర్పాటు చేసిన ట్రాక్‌పైనే సాధన చేసుకుంటున్నారు. జిల్లా కేంద్రంలోని పీయూలో గతేడాది అంతర్జాతీయ ప్రమాణాలతో రూ.10 కోట్ల వ్యయంతో సింథటిక్ ట్రాక్ నిర్మించారు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి దీన్ని ప్రారంభించారు. ప్రధాన స్టేడియంలో లేకపోవడం అథ్లెట్లను నిరాశకు గురిచేస్తోంది.

స్టేడియంను పరిశీలించిన కేంద్ర సభ్యులు

ఖేలో ఇండియా పథకం కింద పలు జిల్లాలో అధునాతనమైన సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్‌లు ఏర్పాటవుతున్నాయి. ఇప్పటికే రాష్ట్రంలోని వరంగల్, మెదక్ జిల్లాల్లో సింథటిక్ ట్రాక్ ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లాకే తలమానికమైన మహబూబ్‌నగర్ జిల్లాలో జిల్లా యువజన క్రీడాశాఖ ఆధ్వర్యంలోని ప్రధాన స్టేడియంలో సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్ ఏర్పాటుకు గతంలో ప్రణాళికలు రూపొందించారు. ఖేలో ఇండియా పథకం కింద మెయిన్ స్టేడియంలో సింథటిక్ ట్రాక్ ఏర్పాటు కోసం ముందుగా జిల్లా క్రీడా శాఖ ద్వారా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(శాయ్)కు ప్రతిపాదనలు పంపారు. మెయిన్ స్టేడియంలో 400 మీటర్ల 8 లైన్ల సింథటిక్ ట్రాక్ ప్రతిపాదనలకు సంబంధించి 2021 అక్టోబరు 22న ఖేలో ఇండియా కేంద్ర పరిశీలన కమిటీ సభ్యులు పరిశీలించి, వివరాలు సేకరించారు. అయితే మెయిన్ స్టేడియంలో సింథటిక్ ట్రాక్ ఏర్పాటుకు కేవలం ప్రతిపాదనలకే పరిమితమైందనే విమర్శలు ఉన్నాయి.

ఔత్సాహిక క్రీడాకారులకు వరం..

జిల్లా కేంద్రంలోని ప్రధాన స్టేడియంలో సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్ ఏర్పాటైతే ఔత్సాహిక క్రీడాకారులకు మెరుగైన వసతులు అందుబాటులోకి వస్తాయి. సింథటిక్ ట్రాక్‌లో అంతర్జాతీయ స్థాయిలో సౌకర్యాలు ఉంటాయి. జాతీయ స్థాయి పోటీలు జరిగే అవకాశం ఉంటుంది. రాష్ట్ర అథ్లెటిక్స్ అకాడమీ ఏర్పాటు అవకాశం ఉంటుంది.

శాట్‌కు ప్రతిపాదనలు పంపించాం..



ప్రధాన స్టేడియంలో సింథటిక్ ట్రాక్ ఏర్పాటు కోసం స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణకు ప్రతిపాదనలు పంపించాం. అదే విధంగా మరోసారి శాట్ ద్వారా ఖేలో ఇండియాకు ప్రతిపాదనలు పంపించేలా తగిన చర్యలు తీసుకుంటున్నారు. సింథటిక్ ట్రాక్ వస్తే అథ్లెటిక్స్ క్రీడాకారులకు మెరుగైన శిక్షణకు అవకాశంతో పాటు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పోటీలు నిర్వహించుకునేందుకు అవకాశాలుంటాయి.

\- శ్రీనివాస్. డీవైఎస్‌వో, మహబూబ్‌నగర్

సింథటిక్ ట్రాక్ ఏర్పాటు చేయాలి



ప్రధాన స్టేడియంలో సింథటిక్ ట్రాక్ ఏర్పాటు చేయాలి. ఇప్పటికే స్టేడియంలో ఎన్నో క్రీడా వసతులు ఉన్నాయి. ఇక్కడ సింథటిక్ ట్రాక్ లేకపోవటంతో చాలా మంది జిల్లా అథ్లెట్లు హైదరాబాద్‌లో ప్రాక్టీస్ చేస్తున్నారు. అకాడమీ ఏర్పాటు చేయవచ్చు. ప్రజాప్రతినిధులు, ఉన్నత అధికారులు స్పందించి ట్రాక్ ఏర్పాటుకు కృషి చేయాలి.

\- శరత్‌చంద్ర, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, మహబూబ్‌నగర్

సంఘాల ఏర్పాటుతో సంఘటితం కావాలి

» ఏఐయూకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాము



భారత రైతు సంఘం జిల్లా నాయకులు సిద్దు, బాలకృష్ణ, రాములు, తాయప్ప, అంజి, వై.అంజి, శ్రీహరి తదితరులున్నారు.
ఏఐయూకేఎస్ మహాసభలో మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాము

మద్దూర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రైతులు సంఘాలను ఏర్పాటు చేసుకొని సంఘటితం కావాలని ఏఐయూకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.రాము పిలుపునిచ్చారు. మద్దూర్‌లో ఆదివారం జరిగిన నారాయణపేట జిల్లా ఏఐయూకేఎస్ ప్రథమ మహాసభలకు రాముతో పాటు, జిల్లా కార్యదర్శి యాదగిరిలు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. రైతులు సంఘాలుగా ఏర్పడి తాము ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. రైతులు పండించిన పంటలకు స్వామినాథన్ సిఫారసు మేరకు మద్దతు ధర చట్టాన్ని అమలు చేస్తామని ఎన్నికల ముందు చేసిన వాగ్దానాన్ని బీజేపీ అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా డివిజన్ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చెన్నారెడ్డి, ఉపాధ్యక్షుడిగా నారాయణ, ప్రధాన కార్యదర్శిగా కొండ నర్సిములు, సహాయ కార్యదర్శిగా బాలకృష్ణతో పాటు 10 మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో అఖిల

జామె మసీదు పునఃప్రారంభం

మూసాపేట, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : పవిత్రమైన మసీద్ నిర్మాణంలో భాగస్వాములైన దాతలు, భక్తులకు భగవంతుడు స్వర్గ మార్గానికి తీసుకెళ్తాడని జామీయా నిజామీయా ఉలేమా, ముస్లిం పర్సనల్ లా బోర్డు ప్రతినిధి మౌలానా ముఫ్తి ఖలీల్ అహ్మద్ సాహెబ్ అన్నారు. మండల కేంద్రంలో దివంగత ఖాజాపాషా జ్ఞాపకార్థం వారి కుమారులు రాషేద్ సోదరుల ఆర్థిక సహకారంతో పునఃనిర్మాణం చేసిన జామె మసీదు ఆదివారం ప్రారంభించి, మాట్లాడారు. అంతకుముందు మహ్మద్ ప్రవక్త దైవ సందేశం, భక్తి ఆధ్యాత్మికత, ధార్మికత సందేశాలు, ఫాతేహా, దువా, భక్తిమార్గాలను సందేశించారు. అంతకుముందు దాతలు రాషేద్ సోదరులను అభినందించి, వారికి స్వర్గం కలగాలని ప్రార్థించారు. ముస్లిం మత గురువులు, ఉలేమాలు, ఇమామ్‌లను మసీద్ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో జామీయా నిజామియా ప్రతినిధి ముఫ్తి సయ్యద్ రవూఫ్ అలి ఖాద్రీ, ముఫ్తి తస్లీమ్ అన్సారి, ఇమామ్ పక్రుద్దీన్ సాహెబ్, ఇలియాస్ ఖాద్రి, ముఖ్తార్ అహ్మద్, జామే మసీద్ కమిటీ అధ్యక్షుడు ఖాజా మైనోద్దీన్, ఎండీ కలీమ్, అబ్దుల్ ఖాదర్, మదీన అహ్మద్, ఖదీర్, తాజోద్దీన్, ఖలీల్, అఫ్సర్, అబీద్, నయ్యూమ్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

ఎన్నికలకు సిద్ధం కావాలి: రామ్మోహన్‌రెడ్డి

నర్వ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రేపట్నుంచి మండలాల ముఖ్య నాయకులు గ్రామాల్లో పర్యటించి ప్రజలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ఎలా తూట్లు పొడుస్తుందో వివరించి మన కార్యకర్తలను ఎన్నికలకు సిద్ధం చేయాలని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా ఆదివారం నర్వ మండలం రాయికోడ్ గ్రామంలోని శ్రీనివాస్‌రెడ్డి పొలం ఆవరణంలో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సన్నాహక సమావేశంలో మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, చిట్టెం సుచరిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజా వ్యతిరేక విధానాలు అమలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీని ఓడించి బీఆర్ఎస్ పార్టీకి పట్టం కట్టాలని కోరారు. ముందుగా గ్రామాల వారీగా కార్యకర్తలతో సలహాలు, సూచనలు తెలుసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రైతులు, కార్మికులు, విద్యార్థులు, మహిళలు అన్ని వర్గాల ప్రజలు సంక్షేమ పథకాలు అందక ఇబ్బంది పడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీకి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడం అనివార్యం అని అన్నారు. అందుకే బీఆర్ఎస్ శ్రేణులు ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలు చేయడంలో విఫలమై ప్రజల్లో చులకన అయిందని ఎన్నికల అనంతరం గ్యారెంటీగా రైతు భరోసా ఎత్తివేస్తారని జోస్యం చెప్పారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు లక్ష్మణ్, అయ్యప్ప మాజీ ప్రజాప్రతినిధులు, యువ నాయకులు, సోషల్ మీడియా సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బక్కని నర్సింహులు

టీడీపీని బలోపేతం చేస్తాం

● ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు బక్కని నర్సింహులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీని తెలంగాణలో బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామని ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు బక్కని నర్సింహులు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని టీడీపీ నాయకుడు శేఖర్‌రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడుకు తెలంగాణ, ఆంధ్రా ప్రాంతాలు రెండు కళ్లలాంటివన్నారు. జల వివాదం పేరుతో అనవసరంగా చంద్రబాబునాయుడిని, టీడీపీని విమర్శించడం తగదన్నారు. మిగులు జలాల కోసమే కేంద్రంతో మాట్లాడుతున్నారన్నారు. తెలంగాణలో అన్ని ప్రాంతాల్లో పార్టీ అన్ని స్థాయిల కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు.

లయన్స్‌క్లబ్ సేవలు పేదలకు అందించాలి

● పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్


మొక్క నాటుతున్న పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి

దామరగిద్ద, జూలై 20 (ఆంధ్రజ్యోతి): లయన్స్‌క్లబ్ సేవా కార్యక్రమాలు గ్రామాల్లో విస్తృతపరిచి పేదలకు అందించాలని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పేట జిల్లా దామరగిద్ద మండలం గడిమున్‌కన్‌పల్లి రైస్‌మిల్‌లో దామరగిద్ద సెకండ్ ఇన్‌స్టలేషన్ సెరెమోని నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మొక్కలు నాటిన అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ దామరగిద్ద నూతన అధ్యక్షుడిగా శీలం బసిరెడ్డి, కార్యదర్శిగా ఎం.అశోక్, కోశాధికారిగా బాపన్‌పల్లి తిప్పన్న, ఇవెంట్ కోచైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. లయన్స్‌క్లబ్ మాజీ అధ్యక్షుడు భీమయ్యగౌడ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. గ్రామాల్లో పేదలకు వైద్య శిబిరం, కంటి వైద్య శిబిరం, రక్తదాన శిబిరం లాంటి వాటితో ఆర్థిక స్థోమత లేని పేదలను ఆదుకోవాలని గురునాథ్‌రెడ్డి అన్నారు. జోన్ చైర్మన్ గండె ఉమాకాంత్ దామరగిద్ద లయన్స్‌క్లబ్‌కు రూ.5 వేలు బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ చైర్మన్ హరినారాయణ్ భట్టడ్, క్లబ్ నూతన అధ్యక్షుడు శీలం బసిరెడ్డి, మాజీ కార్యదర్శి రవీందర్, కార్యక్రమంలో రాము, ఏ.కన్నిరెడ్డి, మాస్టర్ ఆఫ్ సెరమని లయన్ వై.జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు అచ్చంపేటకు మంత్రుల రాక

» సభా స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే వంశీకృష్ణ


ఎన్‌టీఆర్ స్టేడియంలో సభా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేటటౌన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : ఇందిరా మహిళా శక్తి సంబురాల్లో భాగంగా సోమవారం అచ్చంపేట పట్టణంలోని ఎన్‌టీఆర్ స్టేడియంలో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. సభ ఏర్పాట్లను ఎమ్మెల్యే ఆదివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఇందిరా మహిళా శక్తి సంబురాలకు రాష్ట్ర మంత్రులు సీతక్క, దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావుతో పాటు జిల్లా ఎమ్మెల్యేలు, ఎంపీ మల్లురవి పాల్గొంటారని తెలిపారు. రాష్ట్రంలో ప్రజాపాలన సాగుతోందని, అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా మా ప్రభుత్వ పాలన సాగుతోందన్నారు. బహిరంగ సభకు నియోజకవర్గంలోని మహిళలతో పాటు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రేపు ఇంటర్‌లో స్పాట్ అడ్మిషన్లు

వంగూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన వంగూరు కేజీబీవీ ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ఖాళీ సీట్ల భర్తీకి ఈ నెల 22న స్పాట్ అడ్మిషన్స్ జరుగుతున్నాయని ప్రత్యేక అధికారి కృష్ణవేణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీహెచ్‌డబ్ల్యూ గ్రూప్‌లో-5, సీఈసీలో-25 సీట్లు బాలికలకు మాత్రమే ఖాళీగా ఉన్నాయని, పదవ తరగతి చదివిన విద్యార్థినులు స్పాట్ అడ్మిషన్స్‌కు హాజరు కావాలని ఆమె కోరారు.

బైక్‌పై నుంచి పడి ఇద్దరికి గాయాలు

వెల్దండ, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కొత్రతండా చౌరస్తాలో ఆదివారం బైక్ అదుపుతప్పి క్రింద పడడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. కొత్ర గ్రామానికి చెందిన శివ, ఆంజనేయులు వెల్దండ నుంచి కొత్ర వైపు వెళుతుండగా ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. వీరిని స్థానికులు చికిత్స నిమిత్తం కల్వకుర్తికి తరలించారు.

అదుపు తప్పుతోంది!

● భద్రతలేని బడి బస్సు

» యాజమాన్యం, డ్రైవర్ల నిర్లక్ష్యం.. విద్యార్థుల పాలిట శాపం
» వారంలోపు అయిజలో 9, అలంపూర్‌లో 4 బస్సులు సీజ్

అయిజ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): బడి బస్సు భద్రమేనా? అని పిల్లల తల్లిదండ్రులు ఆలోచించాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి. వేల రూపాయలు ఖర్చు చేసి ప్రైవేటు పాఠశాలలకు బస్సుల్లో పంపిస్తే అవి ఏ మేరకు తమ పిల్లలను భద్రంగా ఇంటికి చేరుస్తాయోనని ఆలోచనలో పడ్డారు. ఒకపక్క పాఠశాల యాజమాన్యం తమ లాభాపేక్ష ధ్యేయంగా బస్సులను ఫిట్‌నెస్‌గా ఉంచటం కోసం ఖర్చుకు వెనుకాడుతున్నారు. బస్సుల భద్రత విషయంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. మరోపక్క డ్రైవర్ల నిర్లక్ష్యం కారణంగా సైతం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇది ఏ మేరకు అంటే అయిజ పట్టణంలోని కాకతీయ మెమోరియల్ స్కూల్‌కు చెందిన 3 బస్సులు ఫిట్‌నెస్‌లేని కారణంగా సీజ్ అయ్యాయి. ఈ నెల 9న ఒక బస్సు సీజ్ కాగా, 10వ తేదీన మరో 2 బస్సులు సీజ్ అయ్యాయి. 14వ తేదీన అయిజ పట్టణానికి చెందిన నవభారత్ పాఠశాల బస్సు ఆగిఉన్న వాహనాలపైకి దూసుకెళ్లింది. ఈ సంఘటనలో 5 వాహనాలు దెబ్బతిన్నాయి. 15వ తేదీన అధికారులు మూకుమ్మడిగా దాడులు జరపటంతో తాండ్రపాడుకు చెందిన గెలాక్సీ పాఠశాల, వైష్ణవి, జీనస్ గ్లోబల్ పాఠశాలల బస్సులు మొత్తం అయిజలో 6 బస్సులు సీజ్ కాగా, పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వారంలోపే అయిజలో 9, అలంపూర్ చౌరస్తాలో మరో 4 బస్సులు సీజ్ చేశారు.

ఫిట్‌నెస్ పరీక్షలు చేయించాలి

ప్రతీ పాఠశాల బస్సుకు ఫిట్‌నెస్ పరీక్ష చేయించాలి. పర్మిట్, బీమా, పొల్యూషన్ పత్రాలు, డ్రైవర్‌కు సంబంధించిన వాల్యూడ్ లైసెన్స్ సమర్పించాల్సి ఉంది. డ్రైవర్‌తో పాటు బస్సులో ఉండే అటెండెంట్ వివరాలను కార్మిక శాఖ కార్యాలయంలో సమర్పించి వారు ధ్రువీకరించిన పత్రాలను రవాణ శాఖ కార్యాలయంలో సమర్పించాల్సి ఉంది. ఫిట్‌నెస్ లేకుండానే బస్సులను విద్యార్థులను చేరవేసేందుకు ఉపయోగిస్తున్నారు.

సీజ్‌చేసి చర్యలు తీసుకుంటాం

బస్సుకు అనుమతులతో పాటు ఫిట్‌నెస్ పరీక్షలు చేయించాలి. విద్యార్థులను చేరవేసేందుకు అనుకూలంగా ఉండాలి. రక్షణ ఏర్పాటు చేయాలి. అనుమతులు లేకుండా బస్సులను ఉపయోగిస్తే సీజ్ చేస్తాం. బడి వేళలో డ్రంకెన్ డ్రైవ్‌లు సైతం నిర్వహిస్తాం. జోగుళాంబ గద్వాల జిల్లాలో 285 ప్రైవేటు బస్సులు ఉండగా, 275 బస్సులను ఫిట్‌నెస్ తనిఖీ చేశాం.

\- వేంకటేశ్వరరావు, జిల్లా రవాణా శాఖ అధికారి


ఆగిఉన్న వాహనాల పైకి దూసుకెళ్లిన అయిజ స్కూల్ బస్సు(ఫైల్)



పట్టుబడి అయిజ పోలీస్‌స్టేషన్‌లోని ప్రైవేటు పాఠశాలల బస్సులు



విశ్రాంత ఉద్యోగులకు బెనిఫిట్స్ అందించాలి

» విశ్రాంత ఉద్యోగుల డివిజన్ అధ్యక్షుడు జి.వేణుగోపాల్ రావు

అచ్చంపేటటౌన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఉద్యోగులకు అందాల్సిన బెనిఫిట్స్ సకాలంలో అందించాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం డివిజన్ అధ్యక్షుడు జి వేణుగోపాల్ రావు అన్నారు. ఆదివారం పట్టణంలోని విశ్రాంత భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. 35 నుంచి 40 సంవత్సరాలుగా విధులు నిర్వహించి రిటైర్డ్ అయిన ఉద్యోగులకు రావాల్సిన బెనిఫిట్స్ ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. అదే విధంగా తమ పీఎఫ్ నుంచి నెలకు రూ.1500 నుంచి రూ.3000 వరకు ఇస్తున్నారే తప్ప ప్రభుత్వం నుంచి ఇవ్వాల్సిన పెన్షన్ రావడంలేదన్నారు. ఆర్టీసీలో పదవీ విరమణ పొందిన వారికి తెల్లరేషన్ కార్డులు వెంటనే మంజూరు చేయాలన్నారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు హైదరాబాద్‌లోని కార్యాలయంలో 600 గజాల ప్లాట్ ఇవ్వడం చాలా సంతోషకరమన్నారు. తక్షణమే ప్రభుత్వం చొరవ తీసుకొని తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు హుస్సేన్, విశ్రాంత ఉద్యోగులు సాయిబాబు, జహంగీర్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న విశ్రాంత ఉద్యోగుల డివిజన్ అధ్యక్షుడు జి వేణుగోపాల్ రావు

అతిథి అధ్యాపకుల నియామకానికి
దరఖాస్తుల ఆహ్వానం

నాగర్‌కర్నూల్ టౌన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని నెల్లికొండ ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మదన్‌మోహన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు, ఇంగ్లిష్, కెమిస్ట్రీ, జువాలజీ, డెయిరీ సైన్స్, కంప్యూటర్ అప్లికేషన్ సబ్జెక్టుల్లో బోధించేందుకు ఆసక్తి కలిగిన అతిథి అధ్యాపకులు పీజీలో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. నెట్/సెట్/పీహెచ్‌డీ అర్హత కల్గిన వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు జూలై 23న బుధవారం మధ్యాహ్నం 12 గంటలలోపు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

'కాల గమనం' పుస్తకావిష్కరణ


ఎంఏ గఫార్ కాల గమనం పుస్తకావిష్కరణ చేసిన కవి నాళేశ్వరం శంకరం

అచ్చంపేట, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : సామాజిక సమస్యలను ప్రధాన అంశంగా తన కవితలలో ప్రస్ఫుటించిన గఫార్ సామాజిక కవిగా గుర్తించబడతారని తెలంగాణ ప్రముఖ కవి నాళేశ్వరం శంకరం అన్నారు. ఆదివారం అచ్చంపేట పట్టణంలోని తెలంగాణ రెసిడెన్షియల్ పాఠశాలలో కాలగమనం పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రముఖ కవి ఎంఏ గఫార్ కలము నుంచి జాలువారిన కాలగమనం పుస్తకావిష్కరణ చేయడం జరిగిందన్నారు. మాతృభాషా ఉర్దూ అయినప్పటికీ తెలుగులో కవిగా రాణించడం గొప్ప విషయమన్నారు. తెలుగు భాషపై ఉన్న మక్కువతో నల్లమల రత్నాలు, ప్రజాప్రస్థానం, మేలుకొలుపు తదితర రచనలు చేసినట్లు ఆయన గుర్తుచేశారు. కుటుంబ నేపథ్యం ఉద్యోగ జీవితా అనుభవం అతని రచనల్లో కళ్లకు కట్టినట్లుగా ఉంటాయని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి కవులను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవులు వల్లభాపురం జనార్దన్, కర్నాటి రఘురాములు, సుబ్బయ్య, సాయిజ్యోతి, నరసింహులు, కాశన్న, మైనుద్దీన్, మోహన్ పాల్గొన్నారు.

కృష్ణా ప్రాజెక్టులకు తగ్గుతున్న వరద

» శ్రీశైలానికి 1.56 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

గద్వాల, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : కర్ణాటక, కృష్ణా పరివాహక ప్రాంతాల్లో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు ఆదివారం తగ్గుముఖం పట్టాయి. దీంతో ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులకు వరద తగ్గిపోవడంతో నీటి విడుదలనూ తగ్గించారు. ప్రస్తుతం శ్రీశైలం ప్రాజెక్టుకు 1.56 లక్షల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతున్నది. కుడి, ఎడమ విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్తు కోసం 67,488 క్యూసెక్కులను వినియోగిస్తున్నారు. పోతిరెడ్డి పాడుకు 20 వేల క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 215.18 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 202.96 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కర్ణాటకలో వర్షాలు తగ్గు ముఖం పట్టడంతో ఇన్‌ఫ్లో తగ్గిపోతున్నది. ఆల్మట్టి ప్రాజెక్టుకు 66 వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా 60 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నారాయణ పూర్ ప్రాజెక్టుకు 65 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, 48వేల క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. జూరాలకు 1.15 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతోంది. ప్రాజెక్టు 19 గేట్లు ఎత్తి 74,081 క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 29,464 క్యూసెక్కుల నీటిని శ్రీశైలం ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు. తుంగభద్ర నుంచి సుంకేసుల ప్రాజెక్టుకు 37 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, 37,263 క్యూసెక్కుల అవుట్ ఫ్లో ఉంది. మొత్తంగా వరద తగ్గుముఖం పట్టడంతో ఇన్‌ఫ్లో మరింత తగ్గించే అవకాశం ఉంది.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

» 32 సంవత్సరాల తరువాత కలిసిన పూర్వ విద్యార్థులు



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కొల్లాపూర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : కొల్లాపూర్ పట్టణంలోని సత్య సాయి విద్యానిలయంలో 1992-1993 విద్యా సంవత్సరంలో 10వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఆదివారం సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఆనాడు తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించి సత్కరించారు. 32 సంవత్సరాల తరువాత పూర్వ విద్యార్థులంతా ఒక్క చోటికి వచ్చి ఆనాటి మధుర జ్ఞాపకాలను చిన్ననాటి తీపి గుర్తులను గుర్తు చేసుకుని రోజంతా ఆహ్లాదంగా గడిపారు. తమ స్నేహబంధాన్ని భవిష్యత్తులో కూడా ఇదే విధంగా కొనసాగించాలని అందరూ నిర్ణయించారు. పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి నిర్వాహకులు సురేష్ కుమార్, పార్థసారథి, ప్రవీణ్ కుమార్, కురుమయ్య కృషి చేశారు.

క్రైం కార్నర్

లారీ ఢీకొని యువకుడి మృతి


శంకర్ (ఫైల్)

కృష్ణ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన నారాయణపేట జిల్లా కృష్ణ మండలంలోని హిందూపూర్ శివారులో జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ఎస్ఐ నవీద్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గురుజాల గ్రామానికి చెందిన శంకర్ హైదరాబాద్ వెళ్లి తిరిగి బస్సులో టై రోడ్డు చేరుకున్నాడు. గ్రామానికి రావడానికి వాహనాలు దొరకక కాలినడకన హిందూపూర్ గ్రామానికి వెళ్తుండగా వెనుక నుంచి గుర్తు తెలియని లారీ శంకర్ (30)ను ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు గుర్తించి విచారణ నిర్వహించి కుటుంబ సభ్యులు సమాచారం అందించారు. తల్లి నాగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని మక్తల్ ప్రభుత్వం ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. ముంబై నుంచి రెండు రోజుల క్రితం గ్రామానికి చేరుకుని హైదరాబాద్ వెళ్లి వస్తానని చెప్పిన కుమారుడు.. తిరిగిరాని లోకానికి వెళ్లడంతో తల్లి రోధనలు మిన్నంటాయి. మృతుడికి భార్య, ముగ్గురు చిన్నారులు ఉన్నారు. ప్రభుత్వం శంకర్ కుటుంబాన్ని ఆదుకోవాలని మండల ప్రజలు కోరారు.

అనుమానాస్పద స్థితిలో రైతు..


కొండారెడ్డి (ఫైల్)

పెద్దకొత్తపల్లి, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : అనుమానాస్పద స్థితిలో రైతు మృతి చెందిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలంలోని దేవునితిర్మలాపూర్ గ్రామంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతు కొండారెడ్డి(64) తమ పొలంలో వరి నాటడానికి కరిగెట మడికి నీరు పెట్టేందుకు శనివారం రాత్రి పొలం దగ్గరికి వెళ్లాడు. ప్రమాదవశాత్తున కరిగెట మడి నీటిలో బోల్తా పడి మృతి చెందాడు. కొండారెడ్డి మృతిపై గ్రామస్థులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మృతుడికి భార్య జయమ్మ, కుమారుడు ఉన్నారు. ఈ ఘటనపై కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయలేదు.

చికిత్స పొందుతూ యువకుడు..

ఊట్కూర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : ఇంటికి రంగులు వేస్తుండగా విద్యుత్ తీగలు తగిలి తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలంలోని పగిడిమారి గ్రామంలో చోటు చేసుకుంది. మండలంలోని అమీన్‌పూర్ గ్రామానికి చెందిన కూలీ కుర్వ మల్లేష్ (25) పెయింటర్ పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. పగిడిమారి గ్రామానికి చెందిన ఇంటికి పెయింట్ వేసె పనిని ప్రారంభించాడు. పది రోజుల క్రితం ఇంటి మిద్దెపై కలర్ వేస్తుండగా తీగలు తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే ఇంటి యజమానితో పాటు స్థానికులు నారాయణపేట ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మహబూబ్‌నగర్ తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఈ విషయంపై ఊట్కూర్ ఎస్ఐ రమేష్‌ను సంప్రదించగా.. ఇప్పటికి వరకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని ఆయన తెలిపారు.

అనాథలైన ముగ్గురు పిల్లలు

» భర్త గుండెపోటుతో, భార్య పాము కాటుతో మృతి


మరియమ్మ (ఫైల్)

వడ్డేపల్లి, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలంలోని కోవెలదిన్నె గ్రామానికి చెందిన హరిజన మరియమ్మ (38) ఆదివారం తెల్లవారుజామున పాము కాటుతో మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. ఇంటి వద్ద నిద్రిస్తుండగా పాము కాటుకు గురికావడంతో ఆమెను చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందింది. కాగా ఐదు రోజుల క్రితం హరిజన మరియమ్మ భర్త తిక్కన్న(40) గుండెపోటుతో మృతి చెందాడు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు, ముగ్గురు కుమారులు ఉన్నారు. తల్లిదండ్రులు అకాల మరణంతో పిల్లలు అనాథలయ్యారు.

వివాహిత బలవన్మరణం

జడ్చర్ల, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలంలోని బూర్గుపల్లికి చెందిన స్వప్న(28) బలవన్మరణానికి పాల్పడింది. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. స్వప్నకు రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తితో ఏడేళ్ల క్రితం వివాహమైంది. భార్యభర్తల మధ్య గొడవల కారణంగా రెండు రోజుల క్రితం బూర్గుపల్లికి వచ్చింది. కాగా ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఆమెకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆత్మహత్యకు భార్యాభర్తల మధ్య గొడవనే కారణంగా ఉండొచ్చని గ్రామస్థులు తెలిపారు. ఈ ఘటనపై ఎలాంటి సమాచారం లేదని జడ్చర్ల పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో కాడెద్దు మృతి

కోయిలకొండ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండ మండల కేంద్రంలో చాకలి గడ్డం కృష్ణయ్య చెందిన కాడెద్దు శనివారం పశుగ్రాసం మేయడానికి వెళ్లి విద్యుదాఘాతంతో మృతి చెందింది. రాత్రి కురిసిన వర్షానికి ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎల్‌టీ వైరు తెగి పడడంతో ఎద్దు వైరుకు తగిలి అక్కడిక్కడే మృతి చెందింది. విషయాన్ని విద్యుత్ అధికారులకు తెలుపగా లైన్‌మన్, వెటర్నరి అధికారులు సంఘటన స్థలానికి వెళ్లి పంచనామా నిర్వహించారు. ఎద్దు విలువ రూ.60వేలు ఉంటుందని రైతులు తెలిపారు.

నిడుగుర్తిలో పాడి ఆవు..

ఊట్కూర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : గడ్డి మేస్తుండగా విద్యుత్ తీగ తగిలి అక్కడిక్కడే ఆవు మృతి చెందిన ఘటన ఆదివారం నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలంలోని నిడుగుర్తి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతు శంకర్‌గౌడ్‌కు చెందిన ఆవు బాపురం దారిలో ఉన్న అనంతరెడ్డి పొలం వద్ద ఒడ్డుకు గడ్డి మేస్తు ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో ఎర్త్‌వైర్ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. నష్టపోయిన రైతుకు నష్ట పరిహారం చెల్లించాలని గ్రామస్థులు కోరారు.

కుక్కను తప్పించబోయి.. ఇద్దరికి గాయాలు

గండీడ్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కుక్కను తప్పించబోయి బైక్ అదుపు తప్పి ఇద్దరికి గాయాలైన ఘటన మండలంలోని కొండారెడ్డిపల్లిలో బస్టాప్ వద్ద చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొమ్మురుతండా, కొత్తపల్లి మండలం చెందిన శంకర్, దశరథ్ శనివారం రాత్రి పని నిమిత్తం కోస్గి నుంచి మహబూబ్‌నగర్ వెళ్తున్నారు. కొండారెడ్డిపల్లి వద్ద రోడ్డుపై కుక్కను తప్పించబోయి బైక్ అదుపు తప్పి కింద పడ్డారు. వారికి గాయాలు కావడంతో జిల్లా ఆసుపత్రికి తరలించారు.

అతి వేగంతో డివైడర్‌ను ఢీకొన్న లారీ



డివైడర్‌ను ఢీకొన్న లారీ

కృష్ణ, జూలై 20(ఆంధ్రజ్యోతి) : అతి వేగంతో వచ్చిన లారీ డివైడర్‌ను ఢీకొన్న ఘటన నారాయణపేట జిల్లా కృష్ణ మండలంలోని హిందూపూర్ గ్రామంలోని 150వ జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం చోటు చేసుకుంది. కర్ణాటక రాష్ట్రం గుల్బర్గా జిల్లా నుంచి రాయచూర్ వెళ్తున్న లారీ అతివేగంతో వస్తూ డివైడర్‌ను ఢీకొని నిలిచిపోయింది. ఉదయం వేళ రోడ్డుపై ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని గ్రామస్థులు తెలిపారు. టై రోడ్డు నుంచి గుల్బర్గా వెళ్లే జాతీయ రహదారి హిందూపూర్ వద్ద రహదారి ఇరువైపులా వేసిన బారికేట్లతోనే వాహనదారులకు ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్థులు తెలిపారు.

కుక్కలకు జనన నియంత్రణ

» ఎట్టకేలకు ఏబీసీ కేంద్రంలో మొదలైన ప్రక్రియ

» ఆపరేషన్ కోసం రూ.1,650 చొప్పున ఖర్చు

» వనపర్తిలో 600 వరకు వీధి కుక్కల గుర్తింపు


ఏబీసీలో వీధి కుక్కల జనన నియంత్రణ వివరాలు తెలుసుకుంటున్న అధికారులు (ఫైల్)

వనపర్తి టౌన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): వీధి కుక్కల నుంచి ప్రజలను రక్షించి, వాటి సంతతిని నియంత్రించే చర్యలను మునిసిపల్ అధికారులు మొదలు పెట్టారు. అందుకోసం వంద రోజుల పట్టణ కార్యాచరణ ప్రణాళికలో వీటిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. వీధిలోకి కుక్కలను పట్టుకెళ్లి ఎనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌లో వ్యాసెక్టమీ, ట్యూబెక్టమీ శస్త్ర చికిత్సలు ప్రారంభించారు. గతంలో ఊరికి దూరంగా డంపింగ్ యార్డుకు సమీపంలో ఏబీసీ కేంద్రాన్ని నిర్మించారు. కానీ అందుకు అవసరమైన పశు వైద్యాధికారి, ఆపరేషన్‌కు అవరమైన పరికరాలు లేకపోవడంతో నిరుపయోగంగా ఉండేది. తాజాగా పశు వైద్యాధికారి వారంలో మూడు రోజులు కేంద్రానికి రావడంతో కుక్కలకు జనన నియంత్రణ ఆపరేషన్ ప్రక్రియ గత 15 రోజులుగా కొనసాగుతుంది.

వైద్యుల సంరక్షణలో..

వీధుల్లో పట్టుకెళ్లిన కుక్కలను ఏబీసీ కేంద్రంలో ఒక రోజు పూర్తిగా విశ్రాంతి ఇచ్చిన తర్వాత మగ, ఆడకు వేర్వేరుగా శస్త్ర చికిత్సలు చేస్తున్నారు. ఆ తర్వాత మూడు, ఐదు రోజుల పాటు వైద్యుడి పర్యవేక్షణలో ఉంచుతున్నారు. కేంద్రంలో కుక్కలను ఉంచడానికి 40 బోనులను ఏర్పాటు చేశారు. వాటికి ఆహారం కూడా అక్కడే వండి పెడుతున్నారు. వైద్యుడి పర్యవేక్షణ తర్వాత వీధుల్లో కుక్కలను ఎక్కడి నుంచి పట్టుకొచ్చారో.. తిరిగి అక్కడే వదిలేస్తున్నారు. మునిసిపల్ అధికారులు ఒక్కొ కుక్కకు ఆపరేషన్, తిండి, పట్టే వారి ఖర్చుల నిమిత్తం రూ. 1,650 ఖర్చు చేస్తున్నారు. ఆపరేషన్ అనంతరం కుక్కను గుర్తించడానికి ఎడమ చెవికి గుర్తుగా కొంత కత్తిరిస్తున్నారు.

కుక్కల సంతతి పెరగకుండా..



వీధి కుక్కల సంతతి పెరగకుండా ఉండేందుకు శస్త్ర చికిత్సలు చేయిస్తున్నాం. కుక్కలను పట్టడానికి మత్తుమందు ఇవ్వడంతో అవి మరణించే ప్రమాదం ఉంటుంది. కేవలం వలలతో మాత్రమే పట్టి ఏబీసీ కేంద్రానికి తరలిస్తున్నాం. ఆపరేషన్ తర్వాత వదిలేస్తున్నాం. అవి కరిచినా ఎలాంటి ప్రమాదం జరగకుండా యాంటీ రేబిస్ వ్యాక్సిన్ ఇప్పిస్తున్నాం.

- వెంకటేశ్వర్లు, మునిసిపల్ కమిషనర్, వనపర్తి

అంతేకాకుండా వీధుల్లో వదిలే కంటే ముందే యాంటీ రేబిస్ వ్యాక్సిన్ ఇస్తున్నారు. ఇలా చేయడంతో అవి కరిచినా ప్రమాదం ఉండదని వైద్యులు చెబుతున్నారు.

జిల్లాలో ఒకే చోట ఏబీసీ

జిల్లాలో వనపర్తి, పెబ్బేరు, కొత్తకోట, ఆత్మకూర్, అమరచింత ఐదు మునిసిపాలిటీకి కలిపి ఏబీసీని వనపర్తిలో ఏర్పాటు చేశారు. వీధి కుక్కలు కేవలం వనపర్తిలోనే 600కు పైగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. మిగిలిన నాలుగు మునిసిపాలిటీలు కలిపితే దాదాపు 2,500 వరకు ఉండే అవకాశం ఉన్నట్లు అధికారుల గణాంకాలు తెలుపుతున్నాయి. ఈనెల 17వ తేదీ వరకు 105 కుక్కలకు జనన నియంత్రణ ఆపరేషన్లు చేశారు.

దివ్యాంగుల పింఛన్ రూ.6వేలకు పెంచాలి

» ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ


మహబూబ్‌నగర్‌లో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

పాలమూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం దివ్యాంగులకు ఇచ్చిన హామీ ప్రకారం నెలకు రూ.6వేలకు పెంచాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఫంక్షన్‌హాలులో దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆగస్టు 13న దివ్యాంగులకు చేయూత పెన్షన్ మహాగర్జనను విజయవంతం చేయడానికి సన్నాహక సదస్సు నిర్వహించినట్లు తెలిపారు. మహాగర్జనకు అధికసంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. కాళ్ల జంగన్న, నరేందర్, బుచ్చయ్య నాయక్, చెన్నకేశవులు, శ్రీనివాసులు, జయపాల్‌రెడ్డి, యాదయ్య, నాగరాజు, మైలారం శ్రీరాములు, మారెపల్లి రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీ నెరవేర్చాల్సిందే

ధన్వాడ: ఎన్నికల ప్రచార సభలో సీఎం రేవంత్‌రెడ్డి దివ్యాంగులకు పింఛన్ పెంచుతామని చెప్పి ఇంత వరకు చేయలేదని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ తెలిపారు. నారాయణపేట జిల్లా ధన్వాడ మండల కేంద్రంలో ఆదివారం జిల్లా దివ్యాంగుల సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ఏర్పడి 19 నెలలు అవుతున్నా.. నేటికి ఇచ్చిన హామీ నెరవేర్చడం లేదన్నారు. అంతకు ముందు గ్రామంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నర్సింహులు, రాజు, తిమ్మయ్య, నరేందర్, మాసమ్మ తదితరులు పాల్గొన్నారు.

నారాయణపేటపై సీఎం వివక్ష

» భూములు కోల్పోతున్న వారికి పరిహారం అందించాలి

» బీజేపీ నాయకుడు నాగూరావు నామాజీ



మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు నాగూరావు నామాజీ

నారాయణపేట టౌన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి నారాయణపేట జిల్లాపై వివక్ష చూపిస్తున్నారని బీజేపీ సీనియర్ నాయకుడు నాగూరావు నామాజీ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లాలో కొనసాగుతున్న అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలను పాలెం తరలించారని, జిల్లా కేంద్రంలో సైనిక్ స్కూల్ ఏర్పాటుకు అడ్డుపడుతున్నాని విమర్శించారు. కొడంగల్ నియోజకవర్గంలో తప్పించి నారాయణపేట, మక్తల్ నియోజకవర్గాల్లో రోడ్ల పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రజలు ఏం పాపం చేశారో కానీ వారి కి వైద్య సేవలను సైతం దూరం చేశారన్నారు. రెండు నెలలుగా పట్టణ ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యసేవలు అందడం లేదన్నారు. ప్రభుత్వ అధికారులు స్పందించకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కొవాల్సి వస్తుందని హెచ్చరించారు. నారాయణపేట, కొడంగల్ ఎత్తిపోతల పథకం కింద భూములు కోల్పోతున్న రై తులకు న్యాయమైన నష్టపరిహారం ఇవ్వాలని బీజేపీ డిమాండ్ చేస్తుందన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో బీజేపీ జిల్లాలో అత్యధిక స్థానాలను గెలిపించుకోవాలనే ఉద్దేశంతో సోమవారం జిల్లా కేంద్రంలో కార్యకర్తల జిల్లా స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ నెల 26న రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు, ఎంపీ డీకే అరుణ జిల్లా కేంద్రానికి రానున్నట్లు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు సత్యయాదవ్, రతంగ్ పాండురెడ్డి, శ్రీనివాస్, పోషల్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

జూరాలకు పోటెత్తిన పర్యాటకులు


ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్న పోలీసులు

» ప్రాజెక్టుపై భారీగా ట్రాఫిక్ జాం

» చేపల రుచి కోసం ఎగబడిన సందర్శకులు


జూరాల ప్రాజెక్టుపై ఫొటోలు తీసుకుంటున్న యువకులు

అమరచింత, జూలై 20 (ఆంధ్రజ్యోతి): జూరాల ప్రాజెక్టుకు భారీ వరద రావడంతో 19 గేట్లు ఎత్తివేయడంతో ఆదివారం పర్యాటకులు భారీగా తరలివచ్చారు. ఆదివారం సెలవు కావడంతో సందర్శకుల తాకిడి మరింత పెరిగింది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాతో పాటు, హైదరాబాద్, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ ప్రాంతాల నుంచి పర్యాటకులు వచ్చారు. పర్యాటకులు చేపలను కొనడానికి పోటీపడ్డారు. పక్కనే ఉన్న చేపల కర్రీ చేయించుకుని రుచి చూశారు. పరాటకుల రద్దీ పెరగడంతో సీఐ శివకుమార్ ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసి ట్రాఫిక్ నియంత్రించారు. ఆత్మకూరు ఎస్ఐలు నరేందర్, హిమబిందు, అమరచింత హెడ్ కానిస్టేబుల్ రాములు, పలువురు సిబ్బంది ఉన్నారు.

క్రీడలతో శారీరక దారుఢ్యం

» జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి స్వాములు


క్రీడలను ప్రారంభిస్తున్న కల్వకుర్తి రెండవ ఎస్ఐ రాజశేఖర్

కల్వకుర్తి, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : క్రీడలతో శారీరక దారుఢ్యం కలుగుతుందని రెండవ ఎస్ఐ రాజశేఖర్, జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి స్వాములు అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలోని జడ్పీ బాలల ఉన్నత పాఠశాలలో ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విజయేందర్‌యాదవ్, సోలపోగుల స్వాములు ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్రీడాకారుల ఎంపికలు నిర్వహించారు. కార్యక్రమానికి పట్టణ రెండవ ఎస్ఐ హాజరై విద్యార్థులను పరిచయం చేసుకుని క్రీడలను ప్రారంభించారు. క్రీడాకారులు నిత్యం సాధన చేస్తూ రాష్ట్ర, జాతీయ స్థాయిలో జిల్లా పేరు నిలబెట్టాలని కోరారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మెడల్స్, ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో పీడీలు బాలసుబ్రహ్మణ్యం, ప్రసాద్, అంజయ్య, రాజు, రాజేందర్, భాస్కర్, సరస్వతి, అబ్దుల్లా, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి కిడ్స్ అథ్లెటిక్స్‌లో ప్రతిభ

కొల్లాపూర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ పట్టణానికి చెందిన వ్యాయామ ఉపాధ్యాయుడు తూర్పు కుమార స్వామి కుమారుడు తూర్పు అగస్త్య జిల్లాస్థాయి కిడ్స్ అథ్లెటిక్స్‌లో ప్రతిభ చాటి జిల్లాలో మొదటిస్థానం సాధించి రెండు గోల్డ్ మెడల్స్ కైవసం చేసుకున్నాడు. ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ (బాలుర) క్రీడా మైదానంలో జిల్లా అథ్లెటిక్స్‌లో అసోసియేషన్ ఆధ్వర్యంలో పదేళ్ల లోపు బాలుర విభాగం జిల్లాస్థాయి కిడ్స్ అథ్లెటిక్స్ ఎంపికలు నిర్వహించారు. 60 మీటర్ల పరుగు పందెంలో జిల్లాలో మొదటిస్థానంతో పాటు స్టాండింగ్ బ్రాడ్ జంప్ విభాగంలో మొదటి స్థానం సాధించి రెండుగోల్డ్ మెడల్స్‌ను తూర్పు అగస్త్య కైవసం చేసుకున్నాడు. దీంతో ఆగస్టు 7వ తేదీన నేషనల్ జావెలిన్ డే సందర్భంగా జనగాం జిల్లాలో రాష్ట్రస్థాయి కిడ్స్ అథ్లెటిక్స్ మీట్‌కు ఎంపికయ్యాడు.

గురుకుల విద్యార్థులకు అస్వస్థత


తీవ్ర జ్వరంతో పాఠశాలలో పడుకున్న విద్యార్థులు

పెద్దకొత్తపల్లి, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ గురుకుల పాఠశాల, కళాశాలలో కొంత మంది విద్యార్థులు వైరల్ ఫీవర్‌కు గురయ్యారు. చికిత్స కోసం ఆదివారం వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ అకుల్ తెలిపారు. పాఠశాల, కళాశాలలో 6వ తరగతి నుంచి ఇంటర్ రెండవ సంవత్సరం వరకు 508మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇందులో 19మంది విద్యార్థులు సాధారణ జ్వరాలు, దగ్గు, జలుబుతో అస్వస్థతకు గురయ్యారు. కొల్లాపూర్ మండలం కుడికిళ్ల గ్రామానికి చెందిన అభిషేక్ రెండు రోజులుగా వాంతులతో బాధపడుతుండడంతో నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో వైద్య చికిత్స చేయించి తల్లిదండ్రులకు అప్పజెప్పినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. కాగా పాఠశాలను బీజేపీ నాయకులు సందర్శించి భోజనం నాణ్యతను గురించి విద్యార్థులను వారు అడిగి తెలుసుకున్నారు.

పాలమూరుకు నిధుల కేటాయింపుపై హర్షం

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు జిల్లాకు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించడంపై ఎంపీ డీకే అరుణ ఆదివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉన్న ప్రాంతాలపై ఇటీవల సర్వే నిర్వహించిన కేంద్రం తీవ్ర మహబూబ్‌నగర్, నారాయణపేట, నాగర్‌కర్నూల్ జిల్లాలను గుర్తించినట్లు తెలిపారు. మూడు జిల్లాలకు కలిపి 15వ ఆర్థిక సంఘం సూచనల మేరకు జాతీయ విపత్తు నిర్వహణ కింద రూ.100 కోట్లు విడుదల చేస్తు ఉత్తర్యులు జారీ చేసినట్లు పేర్కొన్నారు.

'ఐక్యంగా సమస్యలను పరిష్కరించుకుందాం'

మహబూబ్‌నగర్ టౌన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : ఐక్యంగా ఉండి సమస్యలను సానుకూలంగా పరిష్కరించుకుందామని ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల రాష్ట్ర అడిషనల్ కార్యదర్శి సత్యన్నచారి అన్నారు. ఆదివారం పట్టణంలోని కమ్యూనిటీ హాల్‌లో రీజనల్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన హాజరై రీజనల్ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా భాస్కరాచారి, కార్యదర్శిగా సత్యశీలారెడ్డి, సంయుక్త కార్యదర్శులు పాషా, శ్రీనివాసులు, కొండయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదేవిధంగా డిపో కమిటీ అధ్యక్షుడిగా సుల్తాన్, కార్యదర్శిగా శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారిగా అబ్దుల్ రెహమన్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఏఎన్ రెడ్డిని ఎంపిక చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గతంలో యాజమాన్యంతో మాట్లాడి భార్యభర్తలకు డీలక్స్ బస్సు ఉచిత ప్రయణం, అంత్యక్రియలకు రూ.30 వేలు, వైద్యానికి రూ.4లక్షలు, పలు సమస్యలు పరిష్కరించుకున్నట్లు తెలిపారు. కొత్త కమిటీలు రాష్ట్ర కమిటీతో సమన్వయంతో పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫసియుద్దిన్, బసిరెడ్డి, జహంగీర్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

300 మిలియన్ యూనిట్లు దాటిన విద్యుదుత్పత్తి

ఆత్మకూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : ఎగువ, దిగువ జల విద్యుదుత్పత్తి కేంద్రాలలో ఆదివారం నాటికి 300 మిలియన్ యూనిట్లను దాటినట్లు ఎస్ఈ శ్రీధర్ తెలిపారు. ఎగువ కేంద్రంలో ఐదు యూనిట్లను ప్రారంభించి 3.164 మిలియన్ యూనిట్లను ఉత్పత్తి చేయగా, ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటి వరకు 139.139 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి రాబట్టినట్లు తెలిపారు. దిగువ కేంద్రంలో ఆరు యూనిట్లను ప్రారంభించి 24 గంటల్లో 4.188 యూనిట్లను చేపట్టగా, ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటి వరకు 164.867 బిలియన్ యూనిట్లను రాబట్టినట్లు పేర్కొన్నారు. వరద ఇలాగే కొనసాగితే నిర్దేశించిన లక్ష్యాన్ని త్వరలోనే చేరుకునే అవకాశం ఉందని తెలిపారు. ఆశించిన మేర వరద వస్తున్నట్లు తెలిపారు.

ఇంటర్వ్యూ..

మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు

- గురుస్వామి, ఎస్ఐ, తాడూరు



తాడూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు ఉంటాయని ఎస్ఐ గురుస్వామి తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడపడం మూలంగా ప్రమాదాలు జరుగుతాయని ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన తెలిపారు.

మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

మద్యం తాగి వాహనాలు నడిపిన వ్యక్తులు పట్టుబడితే వారి వాహనాన్ని సీజ్ చేసి, ఆ వ్యక్తిపై కేసు నమోదు చేసి కోర్టులో ప్రవేశ పెడతాం. కోర్టుఆదేశాల మేరకుచర్యలు ఉంటాయి.

మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి ఎలాంటి శిక్షలు పడుతున్నాయి.?

మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వ్యక్తులకు కోర్టు ఏకంగా జైలు శిక్షలే విధిస్తున్నది. కొన్నేళ్లుగా వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారిపై సానుకూల దృక్పథంలో జరిమానాలు వేసి హెచ్చరించి నప్పటికీ వారిలో మార్పు రాకపోవడంతో మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన కేసులకు సంబంధించి జైలు శిక్షలే ఎక్కువగా పడుతున్నాయి.

ప్రధాన రహదారులపై వాహనాలు నడుపుతున్న వారికి మీరిచ్చే సూచనలు ఏమిటి?

ప్రధానంగా మద్యం తాగిన తర్వాత వాహనాలు నడపడం చట్టరీత్యా నేరం. ఒకవేళ నడుపుతూ పట్టుబడితే కఠిన చర్యలకు సిద్ధంగా ఉండాలి. వాహనాలు నడిపే వారు మద్యం తాగరాదు. ఫోర్ వీలర్స్ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సీటు బెల్టులు తప్పనిసరిగా పెట్టుకుని ట్రాఫిక్ రూల్స్ పాటిస్తే ప్రమాదాలను అరికట్టే అవకాశం ఉంటుంది.

న్యూస్ బాక్స్

'చేయూత పెన్షన్‌దారుల సభను జయప్రదం చేయాలి'

వెల్దండ, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : ఆమనగల్లు పట్టణంలోని శ్రీలక్ష్మి ఫంక్షన్‌హాల్‌లో సోమవారం వికలాంగుల హక్కుల పోరాటసమితి, ఎమ్మార్పీఎస్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే చేయూత పెన్షన్‌దారుల సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలని వీహెచ్‌పీఎస్ నాయకులు భరత్‌మహారాజ్ కోరారు. ఎమార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ హాజరయ్యే సమావేశానికి వికలాంగులు, వృద్ధులు, వితంతువులు అధిక సంఖ్యలో హాజరవ్వాలని కోరారు.

'ఇందిరా మహిళ శక్తి సభను విజయవంతం చేయాలి'

ఉప్పునుంతల, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : అచ్చంపేట పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియంలో సోమవారం నిర్వహించే ఇందిరా మహిళ శక్తి సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కట్టా అనంతరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభకు ముఖ్య అతిధిగా రాష్ట్ర మంత్రులు సీతక్క, జిల్లా ఇన్‌చార్జి మంతి దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, ఎంపీ డాక్టర్ మల్లు రవి, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ హాజరైవుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశానికి ఉప్పునుంతల మండలం నుంచి మహిళలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అత్యధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నేడు రేషన్ కార్డుల పంపిణీ

ఉప్పునుంతల, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలువురు లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులను సోమవారం అచ్చంపేట పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమకుమార్ రెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణారావు, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ చేతుల మీదుగా రేషన్ కార్డుల పంపిణీ ఉంటుందని తహసీల్దార్ ప్రమీల ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారులు సమావేశానికి హాజరై రేషన్ కార్డులు తీసుకోవాలని కోరారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు పంపిణీ చేయాలి : సీపీఎం

కోడేరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన ప్రతీ ఒక్కరికి రేషన్ కార్డులు ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి పొడేండ్ల రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి కూడా పూర్తిగా అమలు చేయలేదని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ పథకాలకు లబ్ధిదారులను గ్రామ సభల ఆధారంగా ఎంపిక చేస్తేనే నిజమైన పేదలకు ప్రభుత్వ పథకాలు అందుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ నాయకులు శివశంకర్, వరప్రసాద్, వెంకటయ్య, బిచ్చన్న, రవి మాలిక పాల్గొన్నారు.

రైతులకు రుణమాఫీ చేయాలి

- టీడీపీ మండల అధ్యక్షుడు కాశన్న

ఉప్పునుంతల, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకొని రూ 2 లక్షల పైన ఉన్న రైతులకు రుణమాఫీ చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు కాశన్న ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. చాలా మంది రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ కాలేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాని నమ్మి రైతులు రుణాలు చెల్లించకుండా ఉంటే అసలు కంటే మిత్తి ఎక్కువై అప్పులు చెల్లించలేక బ్యాంకు అధికారుల ఒత్తిడి తట్టుకోలేక తీవ్ర మనస్తాపానికి గురవుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వం రైతులకు పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయాలని కోరారు.

శంకుస్థాపనకే సరి బ్రిడ్జి నిర్మాణం ఎప్పుడో మరి

- బ్రిడ్జి నిర్మాణానికి రూ.30 కోట్లు మంజూరు
- ఏడాదిన్నర గడిచినా సాగని పనులు



బ్రిడ్జి నిర్మాణం జరగాల్సిన ప్రాంతం ఇక్కడే...

వంగూరు జూలై 20 (ఆంధ్రజ్యోతి) : వంగూరు-ఉప్పునుంతల మండలాల మధ్య ప్రవహించే దుందుభీ నదిపై ఉల్పర వద్ద బ్రిడ్జి నిర్మాణం ప్రారంభానికే పరిమితమైంది. బ్రిడ్జి అవసరాన్ని గుర్తించి రెండేళ్ల కిందట అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. బ్రిడ్జి నిర్మాణానికి గాను సెప్టెంబరు 2023లో ప్రభుత్వం నుంచి రూ.30 కోట్లు మంజూరయ్యాయి. గతేడాది 2023 సెప్టెంబరులో అప్పటి ఎమ్మెల్యే గువ్వల బాలరాజు వంతెన పనులకు శంకుస్థాపన చేశారు. నేటికీ ఏడాదిన్నర గడిచినా వంతెన నిర్మాణ పనులు ప్రారంభానికే పరితమయ్యాయి.

డిజైనింగ్ రాకపోవటంతో ఆలస్యం

ఉల్పర వద్ద బ్రిడ్జి నిర్మాణం చేయడానికి రూ.30 కోట్ల మంజూరయ్యాయి. గత సంవత్సరం సెప్టెంబరులో వంతెన పనులకు శంకుస్థాపన చేసిన మాట వాస్తవమే. టెండర్ పూర్తి అయింది. కానీ, వంతెన నిర్మాణానికి సంబంధించి డిజైనింగ్ రాకపోవటంతో పనులు ప్రారంభం కావడం లేదు. డిజైన్ హైదరాబాద్ నుంచి రావాలి. డిజైనింగ్ వచ్చిన వెంటనే పనులను ప్రారంభిస్తాం.

- సోహెల్, ఆర్అండ్‌బీ ఏఈ

ఉల్పర వద్ద ...

ఉల్పర వద్ద డిండి వాగుపై బ్రిడ్జి లేదు. డిండి వాగు ప్రవహిస్తున్నప్పుడు రాకపోకలు నిలిచిపోల్సిందే. అచ్చంపేట వయా ఉల్పర మీదుగా కల్వకుర్తి మార్గంపై దారులు నిలిచిపోతాయి. ఉల్పర, కోనాపూర్, రంగాపూర్, మిట్టసదగోడు గ్రామాల నుంచి వాగు అవతల ఉన్న మొల్గర పక్క గ్రామాలకు వెళ్లాలంటే చు ట్టూ తిరిగి పోవాల్సిందే. వర్షాకా లంలో ఒక్కోసారి మూడు నాలు గు నెలలు రాకపోకలు నిలిచిపోతుంటాయి. ధైర్యం చేసి వాగుదా టేందుకు ప్రయత్నించిన కొందరు ప్రమాదంలో చిక్కుకున్న సంద ర్భాలు ఉన్నాయి.

ఎన్నాళ్ల నుంచో...

ఉల్పర వద్ద డిండి వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ఎన్నో ఏళ్ల నుంచి ప్రజాప్రతినిధులు భావించారు. రెండేళ్ల కిందట అధి కారులు ప్రతిపాదనలు రూపొందిస్తే రూ.30 కోట్ల నిధులు మంజూరయ్యాయి. బ్రిడ్జి నిర్మాణం జరిగితే రావాణా సౌకర్యం మెరుగుపడుతుంది.

మొక్కలు నాటి సంరక్షించాలి

- ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి



వట్టెంలో రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్ అనంత నర్సింహారెడ్డితో కలిసి మొక్క నాటుతున్న ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి

బిజినేపల్లి, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి బాధ్యతగా సంరక్షించాలని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని వట్టెంలోని వేంకటేశ్వర స్వామి ఆలయం కొండపై ఆదివారం వనమహోత్సవంలో భాగంగా రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్ అనంత నర్సింహారెడ్డితో కలిసి మొక్కలు నాటి మాట్లాడారు. పచ్చని చెట్లే మానవ మనుగడకు కారణమని అన్నారు. అనంతరం గుట్టపై ఉన్న వెంకన్న స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన ఆయనను అర్చకులు ఆశీర్వదించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అమృత్‌రెడ్డి, వెంకన్నస్వామి ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు సందడి ప్రతాప్‌రెడ్డి, సందడి రామచంద్రారెడ్డి, సందడి సురేందర్‌రెడ్డి, సందడి దేవేందర్‌రెడ్డి, నిత్య అన్నదాన సత్రం అధ్యక్షుడు వాస ఈశ్వరయ్య, హకీం మురళి, భాస్కరాచారి, రాగి మధుసూదన్‌రెడ్డి, భగవంత్‌గౌడ్, రామకృష్ణ, కాంగ్రెస్ నాయకులు, నవోదయ విద్యార్థులు పాల్గొన్నారు.

అందుబాటులో ఎరువులు : ఎమ్మెల్యే

తిమ్మాజీపేట : రైతుకు సరిపోను ఎరువులు అందుబాటులో ఉన్నాయని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలో సింగిల్‌విండోకార్యాలయం ఆవరణలో మన గ్రోమోర్ సంస్థ వారు ఏర్పాటు చేసిన ఎరువుల గోదామును ఆదివారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుకు ఎరువులు సకాలంలో అందించాలని సంస్థ అధికారులకు సూచించారు. ఎమ్మెల్యేను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టెలికాం రాష్ట్ర డైరెక్టర్ శ్రీనివాస్ బహదూర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లయ్యగౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాధవులు, నాయకులు భాస్కర్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, రవూఫ్, దేవస్థానం, మల్లేష్, ముబారక్, వెంకటయ్య, మల్లేష్, అనంతచారి, నాగసాయిలు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు రూ.6 వేల పింఛన్ ఇవ్వాలి



బిజినేపల్లిలో దివ్యాంగుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు

- దివ్యాంగుల సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు

బిజినేపల్లి, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : వికలాంగులకు ప్రభుత్వం రూ.6వేల పింఛన్‌ను వెంటనే అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు కరిగళ్ల దశరథం, గూట విజయ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఆదివారం వికలాంగులు, వితంతువులు, నేతకార్మికులు, వృద్ధులను ఉద్దేశించి వారు మాట్లాడారు. ప్రభు త్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం రూ.4 వేలు, రూ.6వేలు పింఛన్‌ను అందించేలా ఒత్తిడి తీసుకొచ్చేందుకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఆధ్వర్యంలో వచ్చే నెల 13న హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో నిర్వహించనున్న వికలాంగుల చేయూత పెన్షన్‌దారుల మహాగర్జనలో అత్యధికంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అలాగే ఈనెల 21న నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో నిర్వహించ నున్న సన్నాహక సభకు విచ్చేయుచున్న పద్మశ్రీ మంద కృష్ణ మాదిగకు ఘన స్వాగతం పలుకుదామని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీ ఎస్ జిల్లా నాయకులు నాగార్జున, మద్దిలేటి, మంగు అంజి తదితరులు ఉన్నారు.

'సీపీఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయండి'

చారకొండ, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి పట్టణంలో ఆగస్టు 1, 2 తేదీల్లో జరిగే సీపీఐ జిల్లా మూడవ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా సమితి సభ్యుడు డాక్టర్ చిలివేరు శ్రీనివాసులు కోరారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మిక, కర్షక, ప్రజా ప్రయోజనాల కోసం ఎన్నో ఉద్యమాలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో లభ్యమవుతున్న ముడి సరుకులు ఉపయోగించి పరిశ్రమలు ఏర్పాటు చేయాలని కోరారు. మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ఏసారపు అశోక్‌గౌడ్, నాయకులు మద్ది నారాయణరెడ్డి, జెల్ల బాలయ్యగౌడ్, మొగిళ్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి కేవీపీఎస్ రాష్ట్రస్థాయి శిక్షణా తరగతులు

కొల్లాపూర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 22, 23, 24వ తేదీలలో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) ఆధ్వర్యంలో సూర్యాపేటలో నిర్వహించే రాష్ట్రస్థాయి సామాజిక శిక్షనా తరగతులను విజయవంతం చేయాలని ఆ సంఘం మండల కార్యదర్శి బత్తిని రాజు కోరారు. ఆదివారం కొల్లాపూర్ పట్టణంలో సంఘం నాయకులు శిక్షణా తరగతుల పోస్టర్లను ఆవిష్కరించారు. సమాజంలో ఎన్నో ఏళ్లుగా పేరుకుపోయిన సామాజిక అంతరాలను, కుల వివక్షను, మూఢనమ్మకాలను నిర్మూలించడం కోసం కేవీపీఎస్ పని చేస్తుందని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ మండల ఉపాధ్యక్షుడు సంజు, సాయికుమార్, శివ, పండు, నాని, సాయి పాల్గొన్నారు.

ప్రైవేటు ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలి : కేవీపీఎస్

నాగర్‌కర్నూల్ టౌన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : టెస్టులు, స్కానింగ్‌ల పేరుతో పేద ప్రజల నుంచి ఫీజుల దోపిడీ చేస్తున్న ప్రవేటు ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు గుంపల్లి అశోక్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో కేవీపీఎస్ ముఖ్య నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని కొన్ని ప్రైవేటు ఆసుపత్రులు టెస్టులు, స్కానింగ్‌ల పేరుతో ఇష్టానుసారంగా డబ్బులు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. అంతే కాకుండా పేద ప్రజలు అనారోగ్యం పాలై ఆస్తులు అమ్ముకుని వైద్యం కోసం ప్రైవేటును సంప్రదిస్తే ఓపీ ఫీజులు రూ.500, 600 వసూలు చేయడం సమంజసం కాదన్నారు. జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి ప్రైవేటు ఆసుపత్రులను తనిఖీ చేసి అధిక ఫీజులను నియంత్రించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు సత్యనారాయణ, క్రాంతి, రాము పాల్గొన్నారు.

కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు

కొల్లాపూర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక, రైతు వ్యతిరేక విధానాలు అమలు చేస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు అన్నారు. కొల్లాపూర్‌లో రైస్‌మిల్ హమాలీ యూనియన్ సమావేశం వెంకటస్వామి అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మూడవసారి అధికారంలోకి వచ్చాక రైతాంగ వ్యతిరేక చట్టాలు చేస్తూ రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోందని అన్నారు. కార్మిక హక్కులను కాలరాస్తూ 8 గంటల పని దినాన్ని 10 గంటలకు పెంచుతూ కార్మికులపై పని భారం మోపిందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి శివవర్మ, నాయకులు ఎండీ సలీం, సత్యం, పకీర సంఘం రామకృష్ణ, శివకుమార్, సతీష్, ఎల్లయ్య, వెంకటస్వామి పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోవాలి



పెద్దకొత్తపల్లిలో పారిశుధ్య కార్మికుడి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సీఐటీయూ నాయకుడు ఈశ్వర్

పెద్దకొత్తపల్లి, జూలై20 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో గ్రామపంచాయతీ కార్మికుడు ఎదిరేపల్లి రవి అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సీఐటీయూ నాయకులు గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో రవి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకో వాలని ప్రభుత్వాన్ని కోరారు. పెద్దకొత్త పల్లిలో గ్రామపంచాయతీలో పదేళ్ల నుంచి పారి శుధ్య కార్మికునిగా పని చేస్తూ గ్రామప్రజలకు అనేక సేవలందించారని అన్నారు. ప్రభుత్వం రూ.పది లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యదర్శి నాగశేషి తక్షణ సహాయం కింద మృతుని కుటుంబానికి పది వేల రూపాయలు అందజేశారు. సీపీఎం మండల కార్యదర్శి దశరథం, గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు వెంకటస్వామి, రాజేందర్, రాముడు, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

ఆహ్లాదం కోసం ప్రకృతిని కాపాడాలి

- వాకర్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో అడవిలో ట్రెక్కింగ్



ఉమామహేశ్వరం మన్ననూరు దారిలో అడవీ అందాలను ఆస్వాదిస్తున్న వాకర్స్

మన్ననూర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : అమ్మలాంటి ప్రకృతిని కాపాడుకొని అందాలను ఆస్వాదించాలని అచ్చంపేట వాకర్స్ అసోసియేషన్ ఫౌండర్ చందూనాయక్, ప్రధాన కార్యదర్శి ఉప తహసీల్దార్ రమేష్ అన్నారు. అచ్చంపేట వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మార్నింగ్ వాక్ మన్ననూరు నుంచి ఉమామహేశ్వర క్షేత్రానికి ఆదివారం ట్రెక్కింగ్ నిర్వహించారు. మొదట వాకర్స్ సభ్యులందరూ మన్ననూరు చెక్‌పోస్టు ఆవరణలోని పర్యావరణ వనమాలిక వద్దకు చేరుకోగా, అటవీ శాఖ ఎడ్యుకేషన్ అధికారి శ్వేత జెండా ఊపి కాలినడకను ప్రారంభించారు. అడవిలో నడక చేస్తున్న క్రమంలో పాటించాల్సిన నియమాలను వివరించారు. వాకర్స్ మన్ననూరు చెక్‌పోస్టు నుంచి అడవీ మార్గంలో ఉమా మహేశ్వర క్షేత్రానికి ట్రక్కింగ్ చేశారు. రేంజర్ సుబ్బు, బీట్ అధికారి ఆశ, చెంచు యువకులు ప్రశాంత్, ప్రభాస్, పరశురాం, ఆంజనేయులు గైడ్‌లుగా వ్యవహరించి పులుల పాద ముద్రలు, వన్యప్రాణుల జీవనశైలి, వృక్ష సంపద తదితర అంశాలపై అవగాహన కల్పించడం సంతృప్తినిచ్చిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రఘునందన్, హెచ్‌ఎం బిచ్యానాయక్, విశ్రాంత ఉద్యోగులు నర్సోజీ, అశోక్‌ప్రసాద్, వాకర్స్ క్లబ్ సభ్యులు ప్రసాద్, నిరంజన్, రాములు, శివశంకర్, సాదిక్, సత్యం, క్రాంతి పాల్గొన్నారు.

ఐక్యతతోనే అణగారిన జాతుల అభివృద్ధి

- శాలివాహన సంఘం జిల్లా ప్రచార కార్యదర్శి వట్టెపు పరమేశ్వర్



శాలివాహన సంఘం కమిటీ సభ్యులు

తెలకపల్లి జూలై20 (ఆంధ్రజ్యోతి) : భారతీయ సమాజంలో అణగారిన జాతుల అభివృద్ధిని సాధించే క్రమంలో ఐకమత్యమే మహాబలం అని కుమ్మరి శాలివాహన సంఘం జిల్లా ప్రచార కార్యదర్శి వట్టెపు పరమేశ్వర్ అన్నారు. ఆదివారం ఉదయం స్థానిక శివాలయ ప్రాంగణలో నిర్వహించిన తెలకపల్లి పట్టణ శాలివాహన సంఘం విస్తృత స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై సంఘం పటిష్టత కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. సంఘం సభ్యులు నెల నెల పొదుపును క్రమం తప్పకుండా జమ చేసుకునే విధంగా నూతన కమిటీ బాధ్యులు సంపూర్ణ బాధ్యతలు తీసుకోవాలని సూచించారు. అనంతరం శాలివాహన సంఘం తెల్కపల్లి పట్టణ కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా జి.భక్తతుకారాం, ప్రధాన కార్యదర్శిగా జి.అర్జున్, కోశాధికారిగా జి.రమేష్, ఉపాధ్యక్షులుగా జి. యుగేందర్, జి.శ్రీకాంత్, సహాయ కార్యదర్శులుగా జి.వెంకటయ్య, బి.మహేష్, కార్యవర్గ సభ్యులుగా జి.రాముడు, జి.సాయికిరణ్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన సలహాదారులు గుండూర్ శ్యామ్ కుమార్, సీనియర్ వృత్తిదా రులు కుమ్మరి తిరుపతయ్య, కమ్మరి బాలయ్య, కుమ్మరి నిరంజన్, కుమ్మరి యాదయ్య, జి.వెంకటేష్, జి.మహేష్, జి.ఆనంద్, జి.శివశంకర్, జి.లింగం, జి.కుమార్, బి.కర్నాకర్, చిన్న మహేష్, మహిళా వృత్తిదారు లు కుమ్మరి బాలమ్మ, వి.తిరుపతమ్మ, బి. తిరుపతమ్మ పాల్గొన్నారు

'ఉపాధి హామీ సిబ్బందితో రికవరీ చేస్తాం'

అచ్చంపేట రూరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : అచ్చంపేట మండల పరిధిలోని 38 గ్రామ పంచాయతీల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద వివిధ రకాల పనులపై ఈనెల 10 నుండి 15వ తేదీ వరకు సామాజిక తనిఖీ బృందం తనిఖీ జరిపి ఈనెల 19న అచ్చంపేట ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన 15వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నివేదికలో సమర్పించారు. 2024-25 సంవత్సరానికిగాను జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 6కోట్ల 37లక్షల 78వేల 739 రూపాయలు ఖర్చు చేయగా ఉపాధి హామీ సిబ్బందికి 3లక్షల 26వేల 504 రూపాయల మేరకు రికవరీలు, జరిమానాలు కట్టాల్సిందిగా ప్రిసైడింగ్ ఆఫీసర్, డీఆర్‌డీఏ అదనపు జిల్లా ప్రాజెక్టు అధికారి రాజేశ్వరి విధించారు. ఉపాధి హామీ సిబ్బందికి త్వరలో షోకాజ్ నోటీసులు ఇచ్చి జరిమానాలు, రికవరీ సొమ్మును రకవరీ చేస్తామని ఎంపీడీవో మధుసూదన్‌గౌడ్ తెలిపారు.

శివాజీ యూత్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులు

బిజినేపల్లి, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : బిజినేపల్లి గ్రామ ఛత్రపతి శివాజీ యూత్ అసోసియేషన్ కమిటీని ఎన్నుకున్నట్లు నూతన అధ్యక్షుడు గంగనమోని హరీష్ ఆదివారం తెలిపారు. ఉపాధ్యక్షులుగా రాము, అభిషేక్‌చారి, రాజు, నరేందర్, పరమేష్, ప్రధాన కార్యదర్శిగా చీర్ణం తిరుపతయ్య, కోశాధికారి, కార్యదర్శులు, సలహాదారులు, సోషల్ మీడియా ఇన్‌చార్జీలను ఎన్నుకున్నట్లు తెలిపారు. శివాజీ మహరాజ్ ఆశయాలను ప్రేరణగా తీసుకొని గ్రామంలో రాజకీయాలకు అతీతంగా గ్రామాభివృద్ధికి పాటు పడుతామని అన్నారు.

జూపల్లిలో భక్తిశ్రద్ధలతో కొత్త పీర్ల పండగ



పీర్ల ఊరేగింపులో పాల్గొన్న గ్రామస్థులు

చారకొండ, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జూపల్లి గ్రామంలో కొత్త పీర్ల పండగను కులమతాలకు అతీతంగా భక్తిశ్రద్ధలతో ఆదివారం ఘనంగా నిర్వహించారు. నిర్వాహకులు శనివారం రాత్రి గ్రామంలోని మసీదులోని పీర్ల చావిడి ముందు ఏర్పాటు చేసిన అగ్ని గుండం చుట్టూ గ్రామస్థులు, యువకులు అలయ్ ఆడారు. తెల్లవారుజామున అలీఅక్బర్, ఆల అబ్బాస్ పీర్లను గ్రామంలో ఊరేగించారు. గ్రామస్థులు పీర్లకు ప్రత్యేక ప్రార్థన లతో పాటు కొత్త దట్టీలు, ఊదు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు కుద్దుస్, సిరాజ్, వెంకటేష్, అక్రం, మల్లేష్, వెంకటయ్య, తిరుపతయ్య, గ్రామస్థులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపరాదు



డ్రంకెన్ డ్రైవ్ తనిఖీ చేస్తున్న ఎస్ఐ జగదీశ్వర్

కోడేరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : మత్తు పానీయాలు సేవించి వాహనాలు నడపరాదని ఎస్ఐ జగదీశ్వర్ వాహనదారులకు అవగాహన కల్పించారు. ఆదివారం మండల పరిధిలోని బావాయిపల్లి గ్రామంలో డ్రంక్ అండ్ డ్రైవ్ చేపట్టారు. మత్తు పానీయాలు సేవించి వాహనాలు నడిపిన అయిదు మందిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ డ్రంక్ అండ్ డ్రైవ్ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతందని ఆయన హెచ్చరించారు. కేసు నమోదు చేసిన వారిని కోర్టుకు హాజరు పరుస్తామని తెలిపారు. వాహనాలు మైనర్లు నడిపినచో వాహనాల యజమానులపై కేసు నమోదు చేయడం జరుగుతుందన్నారు. వాహనాలు నడిపే ప్రతి ఒక్కరికి లైసెన్స్ తప్పనిసరని అలాగే ద్విచక్ర వాహనం నడిపే వారు హెల్మెట్ ధరించాలని తెలిపారు.